ఫాతిమా హైస్కూల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతం

మహబూబాబాద్ రూరల్, జూన్ 9: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్, శ్రీచైతన్య పాఠశాల, ఏకశిలా ఏంజిల్స్, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్‌వీ విద్యాలయంలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 4,412 మంది అభ్యర్థులకు 3,377 మంది హాజరయ్యారని, 1,035 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి, భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లను మూసి వేయించారు. అభ్యర్థుల కోసం తాగునీరు, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. అభ్యర్థుల ఐడీ ప్రూఫ్ ఆధారంగా గంట ముందుగానే లోపలికి అనుమతించి, బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకున్నారు. పట్టణంలోని ఫాతిమా హైస్కూల్ సెంటర్‌ను ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సందర్శించారు. సెంటర్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. సాంఘిక సంక్షేమ గురుకులంలో పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ డేవిడ్, ఏఎస్పీ చెన్నయ్య పరిశీలించారు.

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మహేశ్వరి ప్రతిభ

కురవి, జూన్ 9: జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మండల కేంద్రంలోని ఈఎంఆర్ఎస్ కళాశాల విద్యార్థిని భూక్యా మహేశ్వరి ప్రతిభ చూపింది. ఓపెన్ కేటగిరీలో 16,504 ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో 107 ర్యాంకు సాధించింది. ఏకలవ్య గురుకుల సంస్థ సెక్రటరీ సీతాలక్ష్మి (ఐఏఎస్), కళాశాలలో కోచింగ్ ఏర్పాటు చేసిన డిప్యూటీ సెక్రటరీ చంద్రశేఖర్‌కు కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థిని మహేశ్వరిని అభినందించారు.

గొల్లచర్లలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

డోర్నకల్, జూన్ 9: మండలంలోని గొల్లచర్ల గ్రామంలో ఖాజా భాయ్ మెమోరియల్ ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు మూడో రోజూ హోరా హోరీగా కొనసాగాయి. రెండు రాష్ట్రాల నుంచి పాల్గొన్న క్రీడాకారులు ప్రతిభ చూపారు. క్రీడా పోటీలను తిలకించేందుకు భారీ సంఖ్యలో అభిమానులు, మాజీ క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు భీమనబోయిన సంతోష్, కే యాదగిరి, చెట్టుపల్లి ఉప్పలయ్య, ప్రసాద్, పగిడిపల్లి రామకృష్ణ, చెరుకుపల్లి శ్రీనివాస్, సురేశ్, మహేశ్, సాగర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

జీపీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

మహబూబాబాద్ రూరల్, జూన్ 9: గ్రామ పంచాయతీ సిబ్బందికి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి 11 నెలలుగా వేతనాలు అందడం లేదని, దీంతో వారి కుటుంబ పోషణ గడవక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి వారి వేతనాలు విడుదల చేయాలని, లేకపోతే ఈనెల 15న జిల్లా పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుధాకర్, అప్పిరెడ్డి, మొయినుద్దీన్, లతీఫ్, వెంకన్న, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Wanted Experience (M&F) Local & Kerala Teachers for Primary Hindi, English higher section Hindi Good Salary for fluent English, ELOHIM SCHOOL, Kommala, Wgl. 9390112329, 7702026999.

NTW-318919

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.

NTW-318953

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565

గొర్రెల యూనిట్ల పంపిణీ ఎప్పుడు ?

- అయోమయంలో గొల్ల, కురుమలు
- రెండో విడుత 4,709 మందికి 1,080 మందికి మాత్రమే పంపిణీ
- ఎలాంటి స్పష్టత ఇవ్వని పశు సంవర్ధకశాఖ అధికారులు
- వడ్డీలు కట్టలేక అప్పులో కూరుకుపోతున్న డీడీలు కట్టిన లబ్ధిదారులు

డోర్నకల్, జూన్ 9 : గొల్ల, కురుమలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 75శాతం సబ్సిడీతో గొర్రెల యూనిట్ పథకం ప్రవేశపెట్టింది. మొదటి విడుతలో లబ్ధిదారులను ఎంపిక చేసి గొర్రెల పంపిణీ ప్రక్రియను పూర్తి చేశారు. రెండో విడుత కొందరు లబ్ధిదారులను ఎంపిక చేసి అందులో కొంత మందికే గొర్రెలను ఇచ్చారు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ దృష్ట్యా ఎన్నికల కమిషన్ గొర్రెల పంపిణీ పథకం నిలిపివేసింది. రెండో విడుతలో 4,709 మంది లబ్ధిదారులు డీడీలు కట్టగా, 1,080 మందికి మాత్రమే పంపిణీ చేశారు. జిల్లాలో మిగిలిన 3,629 మందికి గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉన్నది. ఒక యూనిట్ ధర రూ.1.75 లక్షలు ఉండగా లబ్ధిదారుడి వాట 25శాతం రూ.43,750 చెల్లించాల్సి ఉంటుంది. గొల్ల, కురుమల ఆర్థికంగా బలోపేతం కోసం మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేసింది. సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వం బీఆర్ఎస్. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కులవృత్తులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. మాంసం ఉత్పత్తిలో తెలంగాణ నంబర్‌వన్ స్థానంలో నిలిపేందుకు కృషి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత గొర్రెల యూనిట్ పథకం విషయాన్నే పట్టించుకోవడం లేదు. గొల్ల, కురుమల గురించి, దానికి బదులు వేరే పథకం విషయంపై ఊసెత్తడం లేదు. ఆరు గ్యారెంటీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సంక్షేమం, అభివృద్ధి పథకాలను గాలికి వదిలేసింది. ఆరు నెలలుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిన దాఖలు కనిపించడం లేదు. కులవృత్తులు కుంటుపడ్డాయి. డీడీలు కట్టిన గొల్ల, కుర్మలు అయోమయంలో ఉన్నారు. అప్పులు తెచ్చి డీడీలు కట్టామని, ఆరు నెలలుగా వడ్డీలు కడుతున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి గొర్రెల పంపిణీ పథకం అమలు చేయాలని గొల్ల, కురుమలు కోరుతున్నారు.

ఆరు నెలలుగా వడ్డీ కడుతున్నాం..

గొర్రెల యూనిట్ కోసం అప్పు తెచ్చి డీడీ కట్టాను. వాటికి ఆరు నెలలుగా వడ్డీ కడుతున్నా. ఇన్నేళ్లయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎప్పుడు గొర్రెలు పంపిణీ చేస్తారో అని వెయ్యి కండ్లతో ఎదురు చూస్తున్నాం. ఇప్పటికైనా రాష్ట్ర సర్కారు స్పందదించి రెండో విడుత గొర్రెల పంపిణీ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి.

– పరిటాల నాగేశ్వర్‌రావు, ఎంపికైన లబ్ధిదారుడు

మండలాల వారీగా ఎంపికైన లబ్ధిదారులు

మండలం	డీడీలు కట్టిన గొల్ల, కుర్మలు	లబ్ధిదారులు
బయ్యారం	373	96
చిన్నగూడూరు	130	42
దంతాలపల్లి	338	66
డోర్నకల్	149	54
గంగారం	35	12
గార్ల	202	42
గూడూరు	190	60
కేసముద్రం/ ఇనుగుర్తి	490	104
కొత్తగూడ	276	48
కురవి/సీరోలు	577	96
మహబూబాబాద్	301	100
మరిపెడ	447	60
నర్సింహులపేట	64	24
నెల్లికుదురు	492	72
పెద్దవంగర	241	78
తొర్రూరు	404	126
మొత్తం	4,709	1,080

రెండో విడుత గొర్రెలు పంపిణీ చేయాలి

డీడీలు కట్టిన గొల్ల, కురుమలకు రెండో విడుత గొర్రెలు పంపిణీ చేయాలి. ప్రభుత్వం లబ్ధిదారులకు గొర్రెల పంపిణీపై చొరవ తీసుకోవాలి. అప్పులు తెచ్చి డీడీలు కట్టి ఇబ్బంది పడుతున్నారు. వారి సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గొల్ల, కురుమలను పట్టించుకోవడం లేదు.

– బొల్లం అశోక్, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం అండగా నిలవాలి

గొల్ల, కురుమలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలి. ఇప్పటి వరకు డీడీలు కట్టిన లబ్ధిదారులకు వెంటనే గొర్రెలను పంపిణీ చేయాలి. కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కులవృత్తిని ప్రోత్సహించాలి. ఇప్పటి వరకు ఇవ్వని లబ్ధిదారులకు గొర్రెలను వెంటనే పంపిణీ చేయాలి.

–దాసరి నాగేశ్‌యాదవ్, భారత యాదవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు సూర్యప్రకాశ్

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

తొర్రూరు, జూన్ 9: అనుమతులు లేకుండా అడ్మిషన్ చేస్తున్న, గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యుడు గుగులోత్ సూర్యప్రకాశ్ అన్నారు. ఆదివారం తొర్రూరులోని సంఘం కార్యాలయంలో ఎండీ అమీర్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న వేళ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. తొర్రూరులో అనుమతులు లేని పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ రిజిస్ట్రేషన్ ఫీజులు సైతం భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు 25శాతం ఉచితంగా విద్యను అందించాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకుడు జ్యోతిబస్, గుండ్ల రాకేశ్, ద్రావిడ్, చరణ్, వినయ్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం బద్రినారాయణ

మహబూబాబాద్ రూరల్, జూన్ 9: బడీడు పిల్లలను తప్పని సరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మాధవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సంకా బద్రినారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని తూర్పుతండా, చెవుల తండాలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో పిల్లలను బయట పనులకు కాకుండా పాఠశాలకు పంపించాలని కోరారు. నేడు విద్యతోనే విజ్ఞానం పెరుగుతుందని, సమాజంలో చదువుకుంటే దేనినైనా సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్నేహలత, సుజాత, దుర్గయ్య, నాగరాణి పాల్గొన్నారు.

కార్మికుల శ్రమకు తగిన ఫలితం దక్కాలి

ప్రతిజ్ఞ చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

తొర్రూరు, జూన్ 9: కార్మికుల శ్రమకు తగిన ఫలితం దక్కాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవన్‌లో నిర్వహించిన ఐఎఫ్‌టీయూ తొర్రూరు ఏరియా మూడో మహాసభలో ఆయన మాట్లాడారు. కోట్లాది మంది శ్రమనే ఆస్తిగా నమ్ముకున్నారని, పెట్టుబడిదారి సామ్రాజ్యవాద దోపిడీలు పెరిగాయన్నారు. మోదీ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ల వల్ల ఇకపై హక్కులు లేని కార్మికవర్గం కోట్ల సంఖ్యలో మిగలనున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 76 కనీస వేతనాల జీవోలను విస్మరించి తక్కువ వేతనాలు ఇవ్వాలని గెజిట్ విడుదల చేయడం కార్మిక ద్రోహం అన్నారు. మోదీ లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మికులకు అనుకూలమైన చట్టాలను తీసుకురావాలని, లేకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. అనంతరం జిల్లా కోశాధికారి కే సంపత్‌కుమార్ నూతన కార్యవర్గాన్ని 15 మందితో ప్రవేశపెట్టారు. అధ్యక్షుడిగా శ్రీరాం పుల్లయ్య, ఉపాధ్యక్షుడిగా ఏరుగొండ కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎండీ షరీఫ్, సహాయ కార్యదర్శిగా బానోత్ రామ్‌లాల్, కోశాధికారిగా సెగం వెంకన్న, 10 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చింత నవీన్ అధ్యక్షత వహించగా ఐఎఫ్‌టీయూ జెండాను గుండాల సోమనర్సయ్య ఆవిష్కరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నెల్లికుదురు : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

గార్ల : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

డోర్నకల్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

డోర్నకల్, జూన్ 9 : డోర్నకల్ డయోసిసన్ ఉన్నత పాఠశాలలో 198 3-1984 టెన్త్ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు 40 ఏండ్ల తర్వాత కలుసుకొని ఆప్యాయంగా పలకరించుకొని, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం స్నేహితులు సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గార్లలో..

గార్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 1983-1984లో పదో తరగతి చదివిన విద్యార్థులు వరంగల్ ఎన్ ఐటీలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 40 ఏళ్ల తర్వాత కలుసుకొని ఆప్యాయంగా గడిపి, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. పూర్వ విద్యార్థులు మహేశ్, వడ్లమూడి దుర్గాప్రసాద్, రాఘవేంద్రరావు, బుడాన్, లక్ష్మీనారాయణ, భాస్కర్, రామారావు, దయాకర్, నీరజ, భారతి, ఉషారాణి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురులో..

నెల్లికుదురు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అ'పూర్వ' సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు వీరభద్రాచారి, కొత్త లక్ష్మయ్య, లక్ష్మి, ఎన్ సోమయ్య, ఉపేందర్, రాములను ఘనంగా సన్మానించారు. తొలుత మృతి చెందిన మిత్రులు, ఉపాధ్యాయుల ఆత్మకు శాంతి కలుగాలని మౌనం పాటించి నివాళులర్పించారు. పూర్వ, ప్రస్తుత హెచ్ఎంలు మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులందరూ ఒకేచోటకు చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం సంతోషకరమన్నారు. ఈ క్రమంలో ఆడిపాడి ఆనందంగా గడిపారు.

గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మధు

మధు అశోక్

ఇనుగుర్తి, జూన్ 9: గౌడ కౌడిల్య సంక్షేమ సంఘం ఇనుగుర్తి గ్రామ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కూటికంటి మధు గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. సంఘం ప్రధాన కార్యదర్శిగా గండి అశోక్ గౌడ్, కోశాధికారిగా వేముల శ్రీనివాస్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు. అనంతరం ఎన్నికైన వారు మాట్లాడుతూ సంఘం అభివృద్ధి, కులస్తుల సంక్షేమం కోసం నిత్యం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు గండి సతీశ్, ఉమ్మగాని అశోక్, బుర్ర సందీప్, దీకొండ ప్రభాకర్ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, రవీందర్‌రావు

బాధితులకు ఎమ్మెల్సీల పరామర్శ

మరిపెడ, జూన్ 9: మండలంలోని ఎల్లంపేట గ్రామంలో మాజీ ఎంపీపీ గండిబాబు(54) ఆదివారం మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్ రావు, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు, తాళ్లపల్లి శ్రీను, గండి అంబరీష పరామర్శించారు. గండి బాబు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

రాంరెడ్డి ఫొటో వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కల్వలలో ఎమ్మెల్యే..

కేసముద్రం : మండలంలోని కల్వల గ్రామానికి చెందిన కొండ్రెడ్డి రాంరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ ఆదివారం బాధిత కుటుంబ సభ్యులు, అతడి కుమారుడు యాకూబ్‌రెడ్డి(నమస్తే తెలంగాణ రిపోర్టర్)ను పరామర్శించారు. అనంతరం రాంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట అంబాటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్ తదితరులు ఉన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

పూల మొక్క అందిస్తున్న వెంకన్న

మహబూబాబాద్ రూరల్, జూన్ 9: నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని హరితమిత్ర అవార్డు గ్రహీత, ప్రకృతి ప్రేమికుడు దైద వెంకన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని యాదవనగర్ కాలనీలో ఇంటింటికీ పూల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకూ వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ఈ మార్పుల వల్ల మానవులు బతకటానికే ఇబ్బందిగా మారుతుందన్నారు. ప్రతి ఏడాది పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఏసీలు, కూలర్లకు అలవాటు పడి పిల్లలు, వృద్ధులు బయట వాతావరణానికి తట్టుకో లేని పరిస్థితులు నెలకొన్నాయని, సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కలను పెంచాలని కోరారు.

అభివాదం చేస్తున్న గిరిజన ఐక్య సంఘాల నాయకులు

ఎస్టీల రిజర్వేషన్ తగ్గిస్తే ఊరుకోం

ఐక్య గిరిజన సంఘాల నాయకుడు జోగురాం నాయక్

మహబూబాబాద్ రూరల్, జూన్ 9: ఎస్టీలకు రిజర్వేషన్ తగ్గిస్తే ఊరుకునేది లేదని, ఉద్యమం చేస్తామని ఐక్య గిరిజన సంఘాల నాయకుడు జోగురాంనాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏబీ ఫంక్షన్ హాల్‌లో గిరిజన రిజర్వేషన్‌పై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం ప్రభుత్వ శాసనం ద్వారా ఇచ్చిన రిజర్వేషన్ అమలు చేయాలని, గిరిజనులకు అన్యాయం చేయాలనే కుట్రలను తిప్పికొట్టాలని పేర్కొన్నారు. హైకోర్టులో గిరిజన రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా వేసిన పిల్‌పై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమావేశంలో ఐక్య గిరిజనుల సంఘాల నాయకులు అభివాదం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన గిరిజనులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేవంలో గిరిజన నాయకులు రవికుమార్, గుగులోత్ కిషన్‌నాయక్, రామన్న నాయక్, రాందాస్, రాజూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి దొంగల బీభత్సం

రెండిండ్లలో చోరీ.. నాలుగు తులాల బంగారం అపహరణ

దొంగల దాడిలో గాయపడిన సుజాత

నర్సింహులపేట, జూన్ 9: గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి రెండు ఇండ్లలో చోరీకి పాల్పడ్డారు. బీభత్సం సృష్టించి నాలుగు తులాల బంగారం అపహరించిన ఘటన మండలంలోని కౌసల్యదేవిపల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైరోజు సుజాత ఇంటి ఎదుట నిద్రిస్తున్న క్రమంలో దొంగలు ఆమెపై దాడి చేసి మెడలో నుంచి మూడు తులాల పుస్తెలతాడు దొంగిలించారు. సుజాతకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించి చికిత్స అందించారు. కాగా, అదే గ్రామానికి చెందిన పట్టిండ్ల రవి తన ఇంట్లో నిద్రిస్తుండగా తలుపులను పగులగొట్టి లోనికి చొరబడి దాడి చేశారు. అతడి ఇంట్లో నుంచి తులం బంగారం అపహరించుకెళ్లారు. రవికి తీవ్ర గాయాలవడంతో కుటుంబీకులు దవాఖానకు తరలించారు.

కేయూ మెస్‌లో ఆందోళన

హనుమకొండ చౌరస్తా, జూన్ 9 : కేయూ హాస్టల్‌లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మెస్‌లో ఖాళీ గిన్నెలతో యూనివర్సిటీ రిజిస్ట్రార్, హాస్టల్ డైరెక్టర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. హాస్టల్ విద్యార్థులకు చాలీచాలని భోజనం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హాస్టల్‌లో ఉండే సగం మంది విద్యార్థులు మాత్రమే భోజనం చేయగా, మిగిలిన విద్యార్థులను పస్తులు ఉంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు.